క్లుప్తంగా

పీహెచ్‌సీ సందర్శన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య యాదవ్, నాయకులు చిట్టి ప్రదీప్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ శరణ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న వినోద్‌కుమార్, లక్ష్మీ నర్సింహారావు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం బాలరాజుపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు పరామర్శించారు. ఇక్కడ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఏశ తిరుపతి, బండ నర్సయ్య, గొస్కుల రవి తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీమరి దేవయ్య పదిరోజుల క్రితం తాటి చెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు బుధవారం రూ.5వేలు ఆర్థికసాయంగా అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు సుభాష్, రాజయ్య, సురేశ్, సాయి, హనుమయ్య, శంకర్ తదితరులున్నారు.

మండలకేంద్రంలో..

మండలకేంద్రానికి చెందిన శనిగరపు విశ్వనాథం తండి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ బుధవారం రూ.5వేల సాయం అందించారు. ఇక్కడ సంజీవ్, దేవేందర్, గౌస్, రాఘవేందర్ తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందన

గంభీరావుపేట: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో నర్మాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రవేశానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మోహన్ తెలిపారు. విద్యార్థినులు గొర్రె వేదశ్రీ, రోషిణి ఉపాధ్యాయులు సుభాష్, చంద్ర, సువర్ణ, దేవరాజు అభినందించారు.

బైక్‌పై తిరుగుతూ.. ఓటు అభ్యర్థిస్తూ



వేములవాడ : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వేములవాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ బుల్లెట్ బండిపై పట్టణంలోని పలు ప్రాంతాల్లో కలియ తిరిగారు. కూరగాయల మార్కెట్, వాకర్స్, హోటళ్లు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

సత్యసాయి ఆరాధనోత్సవాలు



అన్నదానం చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి, బొప్పాపూర్‌లో సత్యసాయి ఆరాధన ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. సత్యసాయి ఆలయంలో ఉదయం ఓంకారం, సుప్రభాత సేవ చేశారు. స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కూర రవి, బండ సతీశ్, కొండ రమేశ్, భిక్షపతి, రవి, ప్రకాశ్, దేవయ్య, శ్రీనివాస్, సుధాకర్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం..పెద్దలింగాపూర్ గ్రామంలో బుధవారం బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్)లో భాగంగా ఆరో రోజు పశువైద్య శిబిరం నిర్వహించారు. గేదెలు, గొర్రెలు, మేకలకు టీకాలు వేసి మందులు అందించారు. పశువైద్యుడు డాక్టర్ సతీశ్, అధికారులు పాల్గొన్నారు.

ఆహ్లాదానికి దూరం..



ముస్తఫానగర్‌లో మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న పల్లె ప్రకృతి వనం



నీరులేక ఎండిపోతున్న మొక్కలు

- మండలంలో ఊరికి దూరంగా 'పల్లె ప్రకృతి వనాలు'
- వెళ్లేందుకు ఆసక్తి చూపని ప్రజలు
- నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం

గంభీరావుపేట: ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ప్రజాప్రతినిధులు, అధికారుల అనాలోచితమో, ప్రభుత్వ స్థలాల కొరతమే కానీ ప్రకృతి వనాలను ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు తీరిక సమయంలో సేద తీరేందుకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. వనంలోని పచ్చదనాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. సందర్శకులు లేకపోవడంతో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ కొరవడింది. మొక్కల సంరక్షణ, నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా మొక్కలు ఎండిపోతున్నాడు. మండలంలో 21 గ్రామాల్లో అధికారులు పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వీటిలో సగానికి పైగా గ్రామాల్లో ప్రకృతి వనాలు గ్రామాలకు దూరంగానే ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ఇలా ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారులు తెలుపుతున్నారు. కనీసం ఎకరా స్థలంలో వనం ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ తక్కువ విస్తీర్ణంలోనే ఏర్పాటు చేశారు. మొదట్లో ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ పంచాయతీ సిబ్బందితో నీటిని పట్టించడం, శుభ్రంచేయడం, మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకునే వారు. వారికి ఈజీఎస్ ద్వారా వేతనాలు చెల్లించేవారు. వనాల నిర్వహణ బాధ్యత ఈజీఎస్ అధికారులకు రెండేళ్లు మాత్రమే ఉందని, ఇకపై గ్రామ పంచాయతీలే నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని ఈజీఎస్ అధికారులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు, సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం పల్లె ప్రకృతి వనాలపై పట్టింపు కరువైంది. ముస్తఫానగర్ గ్రామంలో మూడు కిలోమీటర్ల దూరంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. దూరం కావడంతో అక్కడికి ఎవరూ వెళ్లకపోవడంతో వనం మందుబాబులకు అడ్డాగా మారింది. మొక్కలు సైతం ఎండిపోయే స్థితిలో ఉన్నాయి.

అధికారులు పట్టించుకోవాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను అధికారులు పట్టించుకోవాలి. ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. అక్కడికి నడిచిపోవడం కష్టమే. అందుకే ఎవరూ వెళ్లడం లేదు. నిర్వహణను అధికారులు పట్టించుకోవాలి. మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి.

– రమేశ్, ముస్తఫానగర్

జీపీలదే బాధ్యత



పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యత ప్రస్తుతం గ్రామ పంచాయతీలదే. ఈజీఎస్ తరఫున రెండేళ్లు నిర్వహించాం. మొక్కల సంరక్షణ, నిర్వహణను పంచాయతీ అధికారులే చూసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో దూరంగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

– అరుణ, ఎంపీవో, గంభీరావుపేట

27న సమావేశాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోయినపల్లి: మూడు ఎస్సీ రిజర్వేషన్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక్క సీటుకూడా మాదిగలకు కాంగ్రెస్ పార్టీ కేటాయించలేదని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి, కో కన్వీనర్ పసల బేస్ కుమార్ ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు మద్దతుగా నిలిచిన బీజేపీకి తమ మద్దతు ఉంటుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో భాగంగా ఈనెల 27న వేములవాడ పట్టణంలో జరిగే మందకృష్ణ మాదిగ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్, నాయకులు మంగళి చంద్రమౌళి, కట్కూరి శ్రీనివాస్, దాసరి సుధాకర్, రాజేంద్ర ప్రసాద్, దాసరి జగన్, అంజయ్య, చంద్రగిరి దుర్గ, అల్వాల అంజయ్య, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

చందుర్తి: లోకసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్నిపార్టీల నాయకులు సహకరించాలని చందుర్తి సీఐ గాండ్ల వేంకటేశ్వర్లు కోరారు. బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు వ్యవహరించాలన్నారు. ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు ప్రచార సభలకు, సమావేశాల కోసం సువిధలో లాగిన్ అయితే నిబంధనలకు లోబడి వెంటనే అనుమతులు లభిస్తాయన్నారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి , బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్, అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- సీఐ శ్రీనివాస్‌గౌడ్
- ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని రాగట్లపల్లి, రాచర్ల గొల్లపల్లిలో బుధవారం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. మద్యంతాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సరైనా ధ్రువ పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా రూ.50 వేలకు మించి వాహనాల్లో నగదు తరలిస్తే సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలలను సీజ్ చేస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. తనిఖీల్లో ఎస్సై రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డుపైనే డ్రైనేజీ నీరు

వేములవాడ : వేములవాడ పట్టణం జాత్రాగ్రౌండ్‌లోని లక్ష్మీగణపతి కాంప్లెక్స్ నుంచి శాస్త్రీ నగర్ వరకు రోడ్డుపై బుధవారం డ్రైనేజీ నీరు పారుతుండగా స్థానికులు, భక్తులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్, దేవాలయ అధికారులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చినా స్పందించలేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అరుణాచలంలో రోడ్డు ప్రమాదం

- కోనరావుపేట వాసి మృతి
- మృతుడు రిటైర్డ్ హెచ్ఎం



రాంరెడ్డి (ఫైల్)

కోనరావుపేట: తీర్థయాత్రలకు వెళ్లిన ఓ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కోనరావుపేట మండలకేంద్రానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ కొమ్మిడి రాంరెడ్డి (65) సోమవారం తోటి ఉపాధ్యాయులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లాడు. మంగళవారం అరుణాచలంలో దర్శనానికి వెళ్తుండగా బస్సు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బస్సు కిందపడి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిసింది. అక్కడే పోస్టుమార్టం . నిర్వహించి మృతదేహాన్ని కోనరావుపేటకు తరలించి గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతుడికి భార్య పుష్పలత, కుమారుడు వామన్, కూతురు ప్రసన్న ఉన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కేంద్రంలోని మండల సమాఖ్య భవనంలో బుధవారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' ఓటు హక్కు నా బాధ్యత అనే అంశంపై వివరిస్తూ స్వీప్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల్లో అర్హులైన వారంతా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాటివనంలో అగ్నిప్రమాదం



మంటల్లో కాలిపోతున్న తాటిచెట్లు

బోయినపల్లి: బూర్గుపల్లి గ్రామ శివారులోని తాటి వనంలో బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో తాటి, ఈతచెట్లు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. తాటివనం పరిసరాల్లో మంటలు ఎగిసి చెట్లకు అంటుకున్నాయని, స్పందించిన గీతకార్మికులు తొలుత వాటిని ఆర్పే ప్రయత్నం చేశారన్నారు. మంటలు ఉధృతం కావడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామన్నారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది.. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే సుమారు 50 తాటిచెట్లు, 100 ఈతచెట్లు కాలిపోయయాని గీత కార్మికులు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మృత్యుంజయం

గంభీరావుపేట: మండలకేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ తన తండ్రి మహ్మద్ ముస్తఫా కమాల్ పాషా జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హమీద్‌తో పాటు రాజవీర్, లక్ష్మీనారాయణ, జంగం రాజు, భూదయ్య, శంకర్, రాజుగౌడ్, వెంకటి, సంతోష్‌రెడ్డి, గౌరీశంకర్, వెంకటి, నుస్రతుల్లాహుస్సేన్ పాల్గొన్నారు.

సిరిసిల్లలో బిజీబిజీగా గడిపిన కేటీఆర్



పెద్దూరులో ఎల్లమ్మ సిద్దోగంలో కేటీఆర్

సిరిసిల్లటౌన్: అటు ఎన్నికల వేళ.. ఇటు శుభకార్యాలతో బుధవారం సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు బిజీబిజీగా గడిపారు. సిరిసిల్ల పర్యటనలో భాగంగా ఆయన ఉదయం నుంచి రాత్రి వరకు వరుస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం సిరిసిల్లలో కౌన్సిలర్ అరుణ, సెస్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ దంపతుల కూతురు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. పెద్దూరు రేణుక ఎల్లమ్మ ఆలయంలో సిద్దోగం వేడుకల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, చీటి నర్సింగరావు తదితరులున్నారు. సాయంత్రం నుంచి రాత్రి 10గంటల వరకు తెలంగాణ భవన్‌లో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట క్లస్టర్ల స్థాయి కార్యకర్తల సమావేశాలను నిర్వహించారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

తంగళ్లపల్లి: గీతకార్మికులు అధైర్యపడొద్దని బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని, జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందేలా కృషిచేస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం తాడూర్ గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంతో కాలిపోయిన తాటి, ఈత చెట్లను పరిశీలించారు. గీత కార్మికులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం గోపాల్‌రావుపల్లెలో జరుగుతున్న ఎల్లమ్మతల్లి సిద్దోగానికి హాజరై అమ్మవారికి పూజలు చేశారు.

పెద్దమ్మ- పెద్దిరాజుల కల్యాణోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాచర్ల కృష్ణమూర్తి అర్చకుల ఆధ్వర్యంలో పెద్దమ్మ పెద్దిరాజుల విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేశారు. అంతకుముందు ఎల్లమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దేశ్‌పాండే అంజనేయులు, రవి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నర్సయ్య, రవి, మంజుల, పర్శరాములు, రమేశ్, బాబు, రాజం, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తరుగు పేరిట రైతులను మోసం చేయొద్దు



రైతులతో మాట్లాడుతున్న కటుకం మృత్యుంజయం

గంభీరావుపేట: తరుగు పేరిట అధిక తూకంవేసి రైతులకు అన్యాయం చేయొద్దని, రైసుమిల్లర్ల వైఖరిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం అన్నారు. మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. బస్తాకు ఎక్కువగా తూకం వేస్తున్నారని,, తాము చెప్పినంత తూకం వేయకపోతే రైసుమిల్లులో ధాన్యం దించుకోబోమని మిల్లర్లు బెదిరిస్తున్నారని రైతులు వాపోయారు. ఈ విషయాన్ని మృత్యుంజయం డీఎస్‌వో జితేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనవెంట సింగిల్‌విండో డైరెక్టర్ మల్యాల రాజవీర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, గంధ్యాడపు శంకర్, వేశాల వెంకటి, రాజుగౌడ్, భాస్కర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎంపీగా వినోద్‌కుమార్‌నే గెలిపించాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌నే గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని రాజన్నపేటలో ఉపాధిహామీ కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సుభాశ్, శ్రీనివాస్, శంకర్, నర్సింలు, శివారెడ్డి, చంద్రారెడ్డి, ఎల్లయ్య, స్వామి, సత్యపాల్, తిరుపతిగౌడ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో బుధవారం ఉపాధిహామీ పనుల వద్ద బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆసాని రాంలింగా రెడ్డి, గజభీంకార్ సంతోష్, సందెవేని రాజు యాదవ్, సింగం చింటు తదితరులు పాల్గొన్నారు.



కనుల పండువగా రాములోరి రథోత్సవం

కోనరావుపేట: మామిడిపల్లిలో గల సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీసీతారామచంద్రస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో భక్తుల, మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చక్రస్నానం, నాగవెల్లి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొక్కుల భారత నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.